సాక్షి
విశాఖపట్నం
సోమవారం, 4, మార్చి, 2024



క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం

క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ ప్రోత్సాహం అందిస్తోందని మేయర్ జి.హరివెంకటకుమారి అన్నారు. 8లో



'బుల్లయ్య'కు స్వర్ణోత్సవ శోభ

డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల స్వర్ణోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. 8లో



సింథియా: ఐఎన్ఎస్ కిల్తాన్, రాయల్ మలేషియా నేవీకి చెందిన కెడీ లెకిర్ సముద్ర ఉపరితలంపై బహుముఖ కార్యకలాపాలు చేపట్టాయి.

న్యూస్‌రీల్

ఎంత మంది జత కట్టినా.. గెలిచేది సీఎం జగనే..

మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్



సీతంపేట: ఎంత మంది జతకట్టినా.. గెలిచేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే అని మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఆదివారం బుల్లయ్య కళాశాల స్వర్ణోత్సవంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. పేద, మధ్య తరగతి ప్రజలందరూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పక్షానే ఉన్నారన్నారు. బలమైన నాయకుడిగా ఉన్న సీఎం జగన్‌ను ఎదుర్కోలేక టీడీపీ, జనసేన కూటమిగా ఏర్పడ్డాయన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ని అని కొనియాడారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకమైన పాలనకు శ్రీకారం చుట్టారన్నారు. మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు.

విశ్వహిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడిగా యార్లగడ్డ

పదవీకాలం రెండేళ్లు



ఏయూక్యాంపస్: విశ్వ హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడిగా రాజ్యసభ పూర్వ సభ్యుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ నియమితులయ్యారు. రెండేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఆదివారం ఉదయం ఏయూ హిందీ విభాగంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ వివరాలు వెల్లడించారు. ఐక్యరాజ్య సమితిలో హిందీని అధికార భాషగా చేయడం లక్ష్యంగా తాను పనిచేస్తానన్నారు. ప్రపంచ వ్యాప్తంగా హిందీ వినియోగం, ప్రపంచ దేశాలలో భారతీయ సంస్కృతిని హిందీ భాష ద్వారా వ్యాప్తి చేయడానికి ఈ సంస్థ పనిచేస్తుందన్నారు. ప్రాంతీయ భాషలతో సమన్వయం చేసి హిందీ శబ్దశక్తిని పెంచడం, తద్వారా భాషా పరంగా జాతీయ సమైక్యతను సాధించడం సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ లక్ష్యాలను నెరవేర్చడానికి సుదీర్ఘ కాలంగా హిందీయేతర ప్రాంతీయుడినైనా హిందీ, తెలుగు భాషల వ్యాప్తికి కృషి చేస్తున్న తనను గుర్తించి జాతీయ అధ్యక్షునిగా నియమించారని చెప్పారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా పర్యటించి వివిధ దేశాల్లో ఈ సంస్థ లక్ష్యాలను విజయవంతంగా నిర్వహిస్తామని చెప్పారు.

నేడు జీవీఎంసీలో జగనన్నకు చెబుదాం



డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం నిర్వహించనున్నారు. పారిశుధ్యం, పట్టణ ప్రణాళికా విభాగం, రెవెన్యూ, యూసీడీ, ఇంజినీరింగ్ తదితర విభాగాలకు సంబంధించిన సమస్యలపై నగర ప్రజలు నేరుగా అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కమిషనర్ సాయికాంత్ వర్మ కోరారు.

అంతర్‌జిల్లాల కబడ్డీ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన కబడ్డీ జట్టు

గాజువాక: నెల్లూరులో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు జరగనున్న 70వ అంతర్ జిల్లాల కబడ్డీ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే జిల్లా జట్టును ఆదివారం ఎంపిక చేశారు. గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఎంపిక పోటీల్లో 18 మంది క్రీడాకారులతో జట్టును సిద్ధం చేశారు. ఎంపికైన వారికి నగరంలోని పోర్టు గ్రౌండ్‌లో మూడు రోజుల పాటు శిక్షణనిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి వి.రాజేశ్వరి, ప్రతినిధి పి.కోటేశ్వర రావు తెలిపారు. ఈ జట్టుకు అంతర్జాతీయ కోచ్ ఉమా శంకర్‌బాబు శిక్షణ ఇస్తారన్నారు. ఎంపిక పోటీలను జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు పి.దాసు, గణపతి, ఉమ, ప్రకాష్, సత్యం, సత్యనారాయణ, శివ, రమణ, బ్రహ్మాజీ, కాశీ ప్రసాద్ పర్యవేక్షించారు.

ఏం పొత్తులో.. ఏంటో?

- అభ్యర్థుల ప్రకటన లేకపోవడంతో మదనపడుతున్న తెలుగు తమ్ముళ్లు
- తూర్పు, పశ్చిమ మినహా ఏ స్థానానికి అభ్యర్థులను డిసైడ్ చేయని టీడీపీ
- పొత్తుల కారణంగా నష్టపోతున్నామన్న ఆందోళనలో కార్యకర్తలు
- జనసేనకి కేటాయిస్తారేమోనన్న భయంలో శ్రేణులు
- కలిసి ప్రచారానికి వెళ్లేందుకు ఆసక్తి చూపని తెలుగుదేశం ద్వితీయశ్రేణి నేతలు



సాక్షి, విశాఖపట్నం: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైఎస్సార్ సీపీ దూకుడుగా వ్యవహరిస్తుంటే.. టీడీపీ మాత్రం పొత్తు చిక్కుముడిని విప్పేందుకు నానా యాతన పడుతోంది. జిల్లాలో కేవలం రెండు నియోజకవర్గాలకు మాత్రమే అభ్యర్థులు ఖరారు చేయడంతో మిగిలిన ప్రాంతాల్లో తమకు సీటు వస్తుందా.. లేదా జనసేన ఖాతాలోకి చేరిపోతుందా అంటూ కలవర పడుతున్నారు. ఒకవేళ జనసేనకు తమ నియోజకవర్గంలో టికెట్ ఇస్తే.. కలిసి ప్రచారం చేసే ప్రసక్తే లేదని ద్వితీయ శ్రేణి క్యాడర్, కార్యకర్తలు ఇన్‌చార్జిలకు స్పష్టం చేస్తున్నారు.

ఈ నెలలోనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాబోతున్న నేపథ్యంలో వైఎస్సార్ సీపీ సమరానికి సిద్ధం అంటూ దూసుకుపోతోంది. ఆయా నియోజకవర్గాల సమన్వయకర్తలు గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా నిత్యం ప్రజల మధ్యే ఉంటూ.. వారితో మమేకమవుతున్నారు. ఇక టీడీపీ, జనసేన విషయానికొస్తే.. పొత్తులతో క్యాడర్ చిత్తవుతున్నారు. ఎవరికి సీటొస్తుందో.. ఎవరు ఎప్పుడు ఎక్కడ నుంచి పోటీ చేస్తారో తెలీని సంకట స్థితిలో ఉంది. విశాఖ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు మాత్రమే తొలి జాబితాలో అభ్యర్థులను ప్రకటించింది. దీంతో మిగిలిన నియోజకవర్గాల్లో అభ్యర్థులు ఆందోళనలో ఉండటంతో దిగువ క్యాడర్ కూడా అయోమయానికి గురవుతోంది. ఉన్న వారికి సీటివ్వొద్దంటూ కొత్తవారు తెరపైకి రావడంతో..

జనసేనతోనా.. నో చాన్స్!

మరోవైపు జనసేన క్యాడర్ కూడా అదే అయోమయానికి గురవుతున్నారు. ఇన్నాళ్లు.. పవన్ కల్యాణ్ సీఎం.. సీఎం.. అంటూ అరిచిగోల చేసిన కార్యకర్తలు.. పొత్తు కల్యాణ్‌గా మారి 24 సీట్లకే పరిమితమవ్వడంతో నిస్తేజంలోకి వెళ్లిపోయారు. హడావిడిగా పార్టీలు మారుతూ జనసేన కండువా కప్పుకున్న వారు కూడా బురదలో కూరుకుపోయామన్న భావనలో ఇళ్లు కదలడం లేదు. చోటా నాయకులుగా ఉన్న వాళ్లు.. గాజు గ్లాసు పట్టుకుని ఎమ్మెల్యే అవుదామని కలలు కంటున్న వారికి పొరపాటున పొత్తులో భాగంగా టికెట్ ఇచ్చేస్తారేమోనన్న అనుమానాలు సైతం టీడీపీలో బలపడుతున్నాయి. ఒకవేళ.. జనసేనకు టికెట్ కేటాయిస్తే.. వారి వెంటనడిచి ప్రచారానికి వెళ్లే పరిస్థితే లేదని టీడీపీ ఇన్‌చార్జులతో తెగేసి చెబుతున్నారు. ద్వితీయ శ్రేణి నాయకులైతే.. జనసేన ఇన్‌చార్జుల కంటే తమ వెంట నడిచే క్యాడరే ఎక్కువగా ఉంటుందంటున్నారు. అలాంటి వారికి ఎమ్మెల్యే టికెట్ ఇస్తే.. ఎలా ఊరుకుంటామంటూ అధిష్టానానికి అల్టిమేటం జారీ చేసినట్లు సమాచారం. పొరపాటున విశాఖలోని వివిధ నియోజకవర్గాల్లో జనసేనకు టికెట్ ఇస్తే మాత్రం.. పొత్తూ లేదు.. గిత్తూ లేదు.. పార్టీ లేదు.. అని బిచాణా సర్దేసేందుకు కూడా టీడీపీ నాయకులు 'సిద్ధం'అంటున్నారని తెలుస్తోంది. మొత్తానికి.. టీడీపీ, జనసేన మధ్య పొత్తు పొడిచినా.. అది మునిగిపోయే పడవ మాత్రమేననే భావన తెలుగు తమ్ముళ్లలోనూ, జనసేన కార్యకర్తల్లోనూ బలంగా నాటుకుంది.

ఎవరి వెనుక ఉండాలో తేల్చుకోలేక ద్వితీయ శ్రేణి నేతలు, కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు. గణబాబుకు పశ్చిమ సీటు కేటాయించినా.. అక్కడ ఉన్న వార్డుల్లో సింహభాగం నాయకులకు మింగుడు పడటం లేదు. దీంతో వారిని బుజ్జగించే పనిలో గణబాబు ఉన్నారే తప్ప.. ప్రజల గురించి ఆలోచించడం మానేశారు. అదేవిధంగా.. తూర్పు నుంచి వెలగపూడికి టికెట్ కేటాయించినా.. అక్కడ కూడా క్యాడర్‌లో నైరాశ్యం నెలకొంది. తన సొంత మద్యం సామ్రాజ్యాన్ని విస్తరించేందుకు తప్ప తమని పట్టించుకోలేదన్న కోపంతో క్యాడర్ రగిలిపోతోంది. ఉత్తరంలో గంటా ఉండే అవకాశం లేకపోవడంతో ఎవరికి సీటు వస్తుందో తెలీక టీడీపీ శ్రేణులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పశ్చిమం, గాజువాక, పెందుర్తిలోనూ అదే పరిస్థితి దాపురించింది. బయటకి రాలేక.. నియోజకవర్గంలో తిరగలేక.. నాయకులు సైతం అందుబాటులో ఉండకపోవడంతో టీడీపీ పరిస్థితి కుక్కలు చింపిన విస్తరిలా మారింది.

వైఎస్సార్ సీపీ గెలుపే మనందరి లక్ష్యం

విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త బొత్స ఝాన్సీ

మద్రిపాలెం: వైఎస్సార్ సీపీని అత్యధిక మెజార్టీతో గెలుపించుకుందామని పార్టీ విశాఖ పార్లమెంట్ సమన్వయకర్త బొత్స ఝాన్సీ పిలుపునిచ్చారు. పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజుతో కలిసి 46వ వార్డు మధుసూదన్‌నగర్ నుంచి ఆదివారం ఎన్నికల ప్రచారం మొదలుపెట్టారు. ముందుగా శ్రీ వైభవ వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పండితులు వారికి వేద ఆశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజల జీవనం సుఖంగా సాగుతోందన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి సీఎం జగన్ పెద్దపీట వేశారని, రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్‌లో యువతకి ఉపాధి అవకాశాలు పెంచేలా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు. కె.కె.రాజు మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఉత్తర నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్నారు. వైఎస్సార్ సీపీ ముందు.. తర్వాత అన్నంతలా ఒక వైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమం అందించామన్నారు. విశాఖ ఎంపీ స్థానానికి ఒక్క ఉత్తర నియోజకవర్గం నుంచే 35 వేలకు పైగా మెజార్టీ అందిస్తామన్నారు. వీఎంఆర్డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి, మాజీ ఎమ్మెల్యే రెహ్మాన్, రాష్ట్ర నాయకులు రొంగలి జగన్నాథం, వుడా రవిరాజు, బొడ్డేటి కాశీ విశ్వనాథం, భరణికాన రామారావు, గుంటూరు నరసింహమూర్తి, భారతి, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు చల్లా రజని, ఈశ్వరరావు, కార్పొరేటర్లు కంపా హనోక్, వావిలపల్లి ప్రసాద్, అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, శ్రీనివాసరావు, పి.ఉషశ్రీ, శశికళ, నాయకులు పేడాడ రమణి కుమారి, పిల్లి సుజాత, డైరెక్టర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



విశాఖ పార్లమెంట్, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్తలు బొత్స ఝాన్సీ, కె.కె.రాజుకు హారతులతో స్వాగతం పలుకుతున్న మధుసూదన్‌నగర్ మహిళలు

సీఎం వైఎస్ జగన్ పర్యటన ఖరారు

రేపు విశాఖకు రాక



సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 5న విశాఖ నగరానికి రానున్నారు. ఈ మేరకు పర్యటన షెడ్యూల్ అధికారికంగా ఖరారైంది. సీఎం జగన్ గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి ఉదయం 10.30 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.45 గంటలకు మధురవాడ ఐటీ హిల్స్ నం.3 వద్ద గల హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ ప్రజాప్రతినిధులతో ఐదు నిమిషాల పాటు ఇంటరాక్ట్ అవుతారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 11 గంటలకు రాడిసన్ బ్లూ రిసార్ట్‌కు చేరుకుంటారు. గంటన్నర పాటు 'విజన్ విశాఖ' పేరిట వాణిజ్య, వ్యాపారవేత్తలతో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడ నుంచి 12.35 గంటలకు బయలుదేరి పీఎంపాలెం వైజాగ్ కన్వెన్షన్ హాల్‌కు చేరుకుంటారు. అక్కడ 'భవిత స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం'లో పాల్గొంటారు. 1.55 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి మధురవాడ ఐటీ హిల్ నెం.3 దగ్గర హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి 2.30 గంటలకు విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు బయలుదేరుతారు.

ఏర్పాట్లు పరిశీలన

మహారాణిపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ పర్యటన ఏర్పాట్లను ఆదివారం సీఎం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, ఏపీ ప్రభుత్వ సలహాదారుడు(స్కిల్ ట్రైనింగ్) గాది శ్రీధర్‌రెడ్డి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పరిశీలించారు. రుషికొండలోని రాడిసన్ బ్లూ రిసార్ట్, పీఎంపాలెంలోని వి.కన్వెన్షన్ వద్ద ఏర్పాట్లను పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ ఎండీ, సీఈవో డాక్టర్ వి.వినోద్ కుమార్, టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సి.నాగరాణి, ఈడీ దినేష్ కుమార్, సీడాప్ సీఈవో ఎం.కె.వి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



సూచనలిస్తున్న ఎమ్మెల్సీ తలశిల రఘురామ్

పోలియో రహిత సమాజమే లక్ష్యం



రేసపువానిపాలెంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ మల్లికార్జున



ఆరిలోవ జీవీఎంసీ ఆస్పత్రిలో పోలియో చుక్కలు వేస్తున్న మేయర్ హరివెంకటకుమారి



రేసపువానిపాలెంలో తమ కుమార్తెకు పోలియో చుక్కలు వేస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, ఆయన సతీమణి డాక్టర్ పృథ్వీ

సీతమ్మధార : ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయడం తప్పనిసరని కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. రేసపువానిపాలెంలోని యూపీహెచ్‌సీలో ఆదివారం జరిగిన పల్స్ పోలియో కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పలువురు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలియోరహిత సమాజమే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా ఆరోగ్య కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాలు, బస్సు, రైల్వే స్టేషన్లలో ప్రత్యేక పల్స్ పోలియో బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. 2,08,163 మంది చిన్నారులకు 1002 పోలియో బూత్‌లు, 74 మొబైల్ యూనిట్ల ద్వారా పోలియో చుక్కలు వేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. 4,220 మంది వ్యాక్సినేటర్లు, 92 మంది పర్యవేక్షణ సిబ్బందిని ఇందుకు కోసం నియమించినట్టు చెప్పారు. ఇంకా మిగిలిపోయిన వారికి సోమ, మంగళవారాల్లో గృహ సందర్శన ద్వారా పోలియో చుక్కలు వేయాలని సిబ్బందిని ఆదేశించారు. డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు, కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఎస్.జీవనరాణి, జిల్లా ప్రోగ్రాం అధికారి సయ్యద్ బేగం, ఎడ్యుకేటర్ శశిభూషన్, యూపీహెచ్‌సీ వైద్యులు ఆర్.మన్‌మోహన్, డీపీవో నాగభూషణం పాల్గొన్నారు.

జిల్లాలో 97.12 శాతం నమోదు



మహారాణిపేట: జిల్లా వ్యాప్తంగా 97.12 శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులు 2,08,163 మంది ఉండగా, ఆదివారం రాత్రి 8 గంటల సమయానికి 97.12 శాతం అనగా 2,02,178 మందికి పోలియో చుక్కలు వేసినట్టు డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు. 2,65,820 డోసుల పోలియో టీకాలు అందుబాటులో ఉంచారు. ఆదివారం పోలియో చుక్కలు వేసుకోని చిన్నారులను గుర్తించి 4, 5 తేదీల్లో జిల్లాలో ఇంటింటికి వెళ్లి వేస్తామన్నారు. 6న జీవీఎంసీ పరిధిలో పోలియో చుక్కలు వేస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు.

సమర్థంగా శాంతి భద్రతల నిర్వహణ

- ఫిబ్రవరిలో 86 కేసుల్లో రూ.1.50 కోట్ల విలువైన సొత్తు చోరీ
- 49 కేసుల్లో రూ.కోటీ నగదు రికవరీ
- రూ.9 కోట్లు విలువైన బంగారం, వెండి వస్తువుల స్వాధీనం
- రూ.56 లక్షల విలువైన 376 మొబైల్ ఫోన్స్ రికవరీ
- నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు



పోయిన వస్తువులను సీపీ రవిశంకర్ సమక్షంలో గుర్తిస్తున్న మహిళ



స్వాధీనం చేసుకున్న మొబైల్స్‌ను పరిశీలిస్తున్న సీపీ

అల్లిపురం: నగర పరిధిలో ఫిబ్రవరిలో శాంతిభద్రతల నిర్వహణ సమర్థవంతంగా చేపట్టామని సీపీ డాక్టర్ ఎ.రవిశంకర్ తెలిపారు. సూర్యాబాగ్ పోలీస్ కమిషనరేట్ ఆవరణలో ఆదివారం ఫిబ్రవరి నెల రికవరీ మేళా, క్రైం రౌండప్ మేళా నిర్వహించారు. ఈ మేరకు జేసీపీ ఫకీరప్ప కలిసి సీపీ వివరాలు వెల్లడించారు. ఫిబ్రవరిలో పోలీస్ కమిషరేట్ పరిధిలో 86 చోరీ కేసులు నమోదయ్యాయని, రూ.1,50,48,239 నగదు చోరీ అయినట్లు గుర్తించామన్నారు. వాటిలో 49 కేసుల్లో రూ.1,00,42,051 రికవరీ చేశామన్నారు.

- అలాగే సుమారు రూ.9 కోట్లు విలువైన 14.47 కేజీల బంగారం, 13.31 కేజీల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నట్టు సీపీ తెలిపారు. ఫిబ్రవరిలో రూ.56 లక్షల విలువైన 376 మొబైల్ ఫోన్లు రికవరీ చేశామన్నారు.
- గత నెల 7న 1200 మందితో రాత్రి 10 నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు నాకాబందీ నిర్వహించి, అక్రమంగా తరలిస్తున్న గంజాయి, లిక్కర్, నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

489 సీసీ కెమెరాల ఏర్పాటు

నగరంలో నేరాల నియంత్రణ కోసం 489 సీసీ కెమెరాలను వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేశామని సీపీ తెలిపారు. నేరాల నియంత్రణపై వివిధ కాలేజీలు, పాఠశాలలు, అసోసియేషన్‌లు, అపార్ట్‌మెంట్స్, తదితర ప్రాంతాల్లో 104 అవగాహన సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించామన్నారు. అపార్టుమెంట్స్, వ్యాపార సంస్థల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నేర చరిత్ర ఉన్న 623 మందిని బైండోవర్ చేశామన్నారు. దొంగతనాల కేసుల్లో అరెస్టయి జైలు నుంచి విడుదలైన 19 మంది నిందితులపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. గత నెలలో 176 నాన్ బెయిలబుల్ వారెంట్ ఉన్న వారిని పది ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి అరెస్ట్ చేశామన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత

- సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ చెప్పారు. నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదులు అందజేయాలన్నారు. డయల్ 1930 హెల్ప్‌లైన్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. 2020 నుంచి ఇప్పటి వరకు 11,319 కేసులు నమోదయ్యాయన్నారు. 1326 మంది బాధితుల నుంచి 3,800 లావాదేవీలు జరిగినట్లు గుర్తించి, రూ.6.3 కోట్లు రికవరీ చేశామన్నారు. బాధితులకు కోర్టుల ద్వారా 457, 458 పిటిషన్ల ద్వారా అందజేశామన్నారు. ఇప్పటి వరకు 450 పిటిషన్లు స్పెషల్ కోర్టుల్లో దఖలు చేశామన్నారు. క్రిప్టో కరెన్సీ నేరాల్లో ఇద్దరు బ్యాంకు ఉద్యోగులతో సహా ఐదుగురిని అరెస్ట్ చేశామన్నారు. థాయ్‌లాండ్ కేంద్రంగా 104 అకౌంట్ల ద్వారా రూ.22.75 కోట్ల లావాదేవీలు జరిగాయన్నారు. సైబర్ నేరాల నియంత్రణకు విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ సీఎస్ఆర్‌లో భాగంగా కోటీ రూపాయలతో అత్యాధునిక సైబర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తుందన్నారు.

పోలీస్ సోషల్ మీడియా అకౌంట్స్

https://whatspp.com/channel/0029VaOHjJHQbSDLLrla1p
Twitter: https://twitter.com/vizagcitypolice
Facebook: https://www.facebook.com/visakhapatnamcitypolice/
instagram: https://www.instagram.com/vizagcitypolice/
whatsapp Number: 9493336633 సోషల్ మీడియా అకౌంట్స్ ప్రజలు వినియోగించుకోవాలని, ఆపదలో ఉన్నప్పుడు వాటి ద్వారా సమాచారం అందించాలని కోరారు. అలాగే ప్రతి నెలా ఒకటి, 15వ తేదీల్లో ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ సీపీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 0891-2523408 నంబర్‌కు కాల్ చేసి నేరుగా సమస్యలను తెలియజేయవచ్చన్నారు.

విజయవంతంగా మిలాన్–2024

మిలాన్– 2024ను అందరి సహకారంతో విజయవంతంగా నిర్వహించామని సీపీ తెలిపారు. 50 దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులకు, కార్యక్రమం నిర్వహణకు 5 వేల మంది పోలీసులతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భద్రత కల్పించామన్నారు.

- గత నెలలో 2,909 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశామని సీపీ తెలిపారు. 326 మైనర్ డ్రైవింగ్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడంపై కేసులు నమోదు చేశామన్నారు. 1,647 ట్రాఫిక్ రూల్స్ పాటించనవి, 42,271 హెల్మెట్ లేని డ్రైవింగ్ కేసులు, 21,500 సెల్‌ఫోన్ డ్రైవింగ్ కేసులు కలిపి మొత్తం 68,257 కేసులు నమోదయ్యాయన్నారు. మైనర్ డ్రైవర్లపై కేసులు నమోదు చేయకుండా తల్లిదండ్రులకు మెసేజ్‌లు పంపి రూ.500 జరిమానా విధించామన్నారు.

యూట్యూబ్ చానల్ ప్రారంభం

పోలీస్ యూట్యూబ్ చానల్‌ను నగర సీపీ ఈ సందర్భంగా ప్రారంభించారు. ప్రజలకు విషయాలను యూట్యూబ్ ద్వారా కూడా అందించనున్నట్లు తెలిపారు. అనంత సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారికి ఆయన స్వయంగా అందజేశారు. బంగారం, వెండి, వాహనాలను కోర్టు ద్వారా అందించనున్నట్లు తెలిపారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసులకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ సమావేశంలో డీసీపీలు సత్తిబాబు, మణికంఠ, క్రైం ఏడీసీపీలు వెంకటరత్నం, గంగాధరం, ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు, అడ్మిన్ ఏడీసీపీ ఎంఆర్‌కే రాజు, ఏసీపీలు, సీఐలు పాల్గొన్నారు.

6న భూఆక్రమణలపై ప్రత్యేక డ్రైవ్

నగరంలో భూకబ్జాల కేసులు అధికమవుతున్నాయన్నారు. స్పందన కార్యక్రమంలో ఓ వృద్ధురాలు ఇచ్చిన ఫిర్యాదుకు స్పందించి ఆమె స్థలాన్ని అప్పగించామని గుర్తు చేశారు. ఈ నెల 6న భూఆక్రమణలపై 21 పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్టు తెలిపారు.

అందుబాటులోకి దిశ దివ్యాంగ సురక్ష

విశాఖలో తొలిసారిగా బధిరులు(మూగ, చెవిటి), అంధులకు దిశ దివ్యాంగ సురక్ష పేరిట ఒక ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామన్నారు. దివ్యాంగ సురక్ష పోలీస్ కంట్రోల్ రూమ్‌కి అంధులైతే 7337324466, చెవిటి, మూగ వారు 7337434422 వాట్సప్ ద్వారా తెలియజేయవచ్చన్నారు.

స్టీల్‌ప్లాంట్ జోలికొస్తే సహించేది లేదు

- ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకుల హెచ్చరిక
- కూర్మన్నపాలెం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు మహా పాదయాత్ర
- సంఘీభావం తెలిపిన మేయర్ హరివెంకటకుమారి



మహాపాదయాత్రలో పాల్గొన్న జీవీఎంసీ మేయర్ హరి వెంకట కుమారి

కూర్మన్నపాలెం/సీతమ్మధార: 'విశాఖ ఉక్కు– ఆంధ్రుల హక్కు అనే నినాదంతో సాధించుకున్న స్టీల్ ప్లాంట్ జోలికి వస్తే సహించేది లేదు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణపై కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే కార్మిక శక్తిని అపహాస్యం చేసినట్టవుతుంది'అని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మేయర్ గొలగాని హరివెంకటకుమారి, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ గాజువాక ఇన్‌చార్జి ఉరుకూటి చందు, పోరాట కమిటీ నాయకులు, కార్మికులు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు మహాపాదయాత్ర నిర్వహించారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ అభ్యర్థన మేరకు ఉక్కు ఉద్యోగులు, నిర్వాసితులు, ప్రజాసంఘాల ప్రతినిధుల కుటుంబ సభ్యులు ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రజల ఆస్తి అని, ప్రజల ఆస్తిని కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. కార్పొరేట్ శక్తులకు ప్రధాని మోదీ కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. ఇందుల్లో భాగంగానే ప్లాంట్‌ను నష్టాల్లో నడిపించి, ప్రైవేట్ వ్యక్తులకు దోచిపెట్టేందుకు చూస్తున్నారని ఆరోపించారు. విశాఖ ఉక్కు ఉత్పత్తి సామర్థ్యం విస్తరణ కోసం చేసిన రుణాల వల్లే ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయని.. సొంత గనులు కేటాయిస్తే సమస్యను అధిగమించవచ్చన్నారు. ఇప్పటికే స్టీల్ ప్లాంట్ ఆస్తులను అమ్మేందుకు పావులు కదుపుతున్నారని, ఈ ప్రయత్నాలను అన్నింటినీ తిప్పి కొడతామన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుతామని ఎన్నికల మేనిఫెస్టోలో రాజకీయపార్టీలు చేర్చాలని డిమాండ్ చేశారు. జీవీఎంసీ వద్ద జరిగిన కార్యక్రమంలో సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పోరాట కమిటీ చైర్మన్ సి.హెచ్.నరసింగరావు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణకు కార్మికుల పోరాటాలు ఉధృతం చేయాలని.. రాబోయే ఎన్నికల్లో బీజేపీని, దాన్ని బలపరిచే పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బీజేపీకి ఒక్క సీటు వచ్చినా.. స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు, ఉద్యమానికి హాని కలుగుతుందన్నారు. పోరాట కమిటీ నాయకులు ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, వై.మస్తానప్ప, కారు రమణ, కె.ఎస్.ఎన్.రావు, జె.అయోధ్యరామ్, వై.టి.దాస్, జె.రామకృష్ణ, బొడ్డు పైడిరాజు, విల్లా రామ్మోహనకుమార్, వరసాల శ్రీనివాసరావు, గుమ్మడి నరేంద్ర, సిటు రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి. నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.ఎం. శ్రీనివాస్, ఆర్.కె.ఎస్.వి.కుమార్, నాయకులు బి.జగన్, కె.పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

బక్కన్నపాలెంలో విషాదం

- సంచలనం రేపిన ఫొటోగ్రాఫర్ హత్య
- రావులపాలెంలో ఘటన



బక్కన్నపాలెం గ్రామంలో మృతుడు బంధువులు, మిత్రులు ఏర్పాటు చేసిన కటౌట్



విషణ్ణవదనాలతో మృతుడి బంధువులు

మధురవాడ: అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో ఫొటోగ్రాఫర్ పోతిన సాయి విజయ్ పవన్ కల్యాణ్(23) హత్యతో మధురవాడ ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. చేతికి అందొచ్చిన కుమారుడు అర్ధంతరంగా కుట్రకు బలైపోవడంతో బాధిత కుటుంబం విషణ్ణ వదనంలో మునిగిపోయింది. బక్కన్నపాలెంకు చెందిన సాయిది పేద కుటుంబం. తండ్రి శ్రీను డ్రైవర్‌గా, తల్లి రమణమ్మ ఫ్యాన్సీ దుకాణంలో పని చేస్తున్నారు. ఫొటోగ్రఫీ అంటే అంతులేని ఇష్టంతో సాయి రూ.15 లక్షలు విలువ చేసే అత్యాధునిక ఫొటోగ్రఫీ, వీడియో కిట్ కొనుగోలు చేశాడు. వీటి సహాయంతో ఈవెంట్లకు వెళ్తున్నాడు. అలా వచ్చిన సంపాదనతో కుటుంబానికి చేదోడుగా నిలుస్తున్నాడు. సాయి డిగ్రీ వరకూ చదువుకున్నాడు. ఈ క్రమంలో అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన నిందితుడు తేజ అనే ఫొటోగ్రాఫర్ ఆన్‌లైన్ బుకింగ్ పేరుతో పరిచయమయ్యాడు. సాయి వద్ద సుమారు రూ. 15లక్షలు విలువ చేసే ఆధునిక కెమెరాల ఎక్విప్‌మెంట్ ఉందని గమనించాడు. వాటిని ఎలాగైనా సొంతం చేసుకోవాలన్న దుర్బుద్ధితో రావులపాలెంలో భారీ ఈవెంట్ ఉందని పిలిచి మరో వ్యక్తి నక్కా వినోద్‌కుమార్ సహాయంతో హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని గోదావరి తీరాన పూడ్చిపెట్టారు. ఈ హత్య ఉదంతంలో నిందితుల్ని పీఎంపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు తేజ తండ్రి సూరిబాబు, విశాఖ యువతి ఇచ్చిన సమాచారం ఆధారంగా స్థానిక పోలీసుల సహకారంతో పీఎం పాలెం పోలీసులు హత్య చేసిన, మృతదేహాన్ని పూడ్చిన ప్రదేశాలను గుర్తించారు. అప్పటికే కుళ్లిపోయిన సాయి మృతదేహాన్ని చూసి అతడి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. జీవిత చరమాంకంలో ఆదుకుంటున్నాడనుకున్న కుమారుడు ఇలా హత్యకు గురికావడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇలాంటి దుస్థితి మరెవ్వరికీ రాకూడదంటూ బోరున విలపించారు. నిందితుల్ని కఠినంగా శిక్షించాలని పోలీసులను వేడుకున్నారు. తీవ్రమైన ఎండలో సైతం గోదావరి ఇసుక తిన్నెలపై కూర్చుని వారు విలపించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

సహాయ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మృతికి సంతాపం



గాయత్రీదేవి మృతదేహానికి నివాళులర్పిస్తున్న సీపీ

అల్లిపురం: నగరానికి చెందిన అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జె.గాయత్రీదేవి శనివారం గుంటూరులో ఆకస్మికంగా మృతి చెందారు. ఆదివారం సీపీ ఎ.రవిశంకర్ ఫోర్ట్‌టౌన్ పరిధిలోని ఆమె నివాసంలో గాయత్రీదేవి పార్థివదేహానికి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి వారిని ఓదార్చారు. గాయత్రీదేవి నాలుగో అదనపు ప్రధాన మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో ఏపీపీగా విధులు నిర్వర్తిస్తున్నారు. శనివారం గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సదస్సుకు హాజరై ఉత్తమ సహాయ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అవార్డును అందుకున్నారు. కాసేపటికే గుండెపోటుకు గురవడంతో ఆకస్మికంగా మృతి చెందారు.

క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం



క్రీడాకారులతో మేయర్ హరి వెంకటకుమారి

ఏయూ క్యాంపస్: క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ ప్రోత్సాహం అందిస్తోందని మేయర్ జి.హరి వెంకటకుమారి అన్నారు. ఏయూ మైదానంలో నిర్వహిస్తున్న 70వ సీనియర్ మెన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్టేట్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలను ఆమె ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర పోటీల ద్వారా మట్టిలో మాణిక్యాలు బయటకు వచ్చారన్నారు. వారికి నిపుణులతో శిక్షణ అందించి జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చర్యలు తీసుకున్నారన్నారు. అనంతరం క్రీడాకారులను ఆమె పరిచయం చేసుకున్నారు. తొలిరోజు ప్రకాశం, పశ్చిమ గోదావరి జట్ల మధ్య పోటీ జరగగా.. 34–20 స్కోర్‌తో ప్రకాశం జట్టు విజేతగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్, విశాఖపట్నం జిల్లా కార్యదర్శి జె.ఎస్.వి.ప్రసాదరెడ్డి, చీఫ్ పాట్రన్ ఎస్.రామకృష్ణారెడ్డి, విశాఖ జిల్లా అధ్యక్షుడు వి.కృష్ణ పాల్గొన్నారు.

కాపులు అన్ని రంగాల్లోనూ రాణించాలి

- మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

విశాఖ విద్య: కాపు జాతి ఔన్నత్యాన్ని చాటేలా అన్ని రంగాల్లోనూ రాణించాలని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. జీవీఎంసీ 90వ వార్డు కాకానినగర్‌లో నిర్మించిన కేటీబీ కళాక్షేత్రం (కాపు, తెలగ, బలిజ) రెండో అంతస్తును ఆదివారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ కాపుల్లో నమ్మితే ప్రాణం ఇచ్చే మనస్తత్వం ఉన్నా, ఐక్యత లేకపోవడంతో అన్నింటా వెనుకంజలో ఉన్నారన్నారు. జిల్లా కేంద్రాల్లో కాపు భవనం నిర్మించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. కాపు సామాజిక వర్గంలోని మహానుభావుల గురించి భవిష్యత్ తరాలు తెలుసుకునేలా కేటీబీ కళాక్షేత్రంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలన్నారు. కేటీబీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బత్తుల చిరంజీవి, అసోసియేషన్ కార్యదర్శి భాస్కరరావు, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్, గంట్ల శ్రీనుబాబు, కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు, నేవల్ డాక్‌యార్డ్ కాపునాడు, కేటీబీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బీఎస్ ప్రకాశరావు, ఎస్.రమణ, తోట దుర్గారావు, రవికుమార్, అప్పలరాజు, కిషోర్ పాల్గొన్నారు.

బుల్లయ్య కళాశాలకు స్వర్ణోత్సవ శోభ



మొదటి బ్యాచ్ విద్యార్థులతో అతిథులు, కళాశాల యాజమాన్యం

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల స్వర్ణోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. కళాశాల అధ్యక్షుడు కె.సి.రెడ్డి అధ్యక్షతన ఆదివారం సాయంత్రం జయభారత్ ప్రాంగణం వేదికగా ఈ వేడుకలు సందడిగా సాగాయి. వ్యవస్థాపక అధ్యక్షుడు, అప్పటి విశాఖ జిల్లా కలెక్టర్ కె.జయభారత్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ఈ వేడుకలను ప్రారంభించారు. కళాశాల మొదటి బ్యాచ్ లెక్చరర్స్, విద్యార్థులు, ప్రస్తుత బ్యాచ్ విద్యార్థులు సందడి చేశారు. అప్పటి జిల్లా కలెక్టర్ కె.జయభారత్‌రెడ్డి మాట్లాడుతూ తన ఆధ్వర్యంలో ఒక్క బీకామ్ కోర్సుతో ఏర్పాటైన కళాశాల 50 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో విజయాలను అందుకుందన్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జి.మధుకుమార్ మాట్లాడుతూ విద్యతో పాటు, క్రీడలు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, స్కౌట్స్ అండ్ గైడ్స్ వంటి ఫిజికల్ యాక్టివిటీతో విద్యార్థులు ఎప్పుడూ ఫిట్‌గా ఉండేలా తీర్చిదిద్దుతున్నట్టు తెలిపారు. గత ఐదు దశాబ్దాలలో కళాశాల సాధించిన ప్రగతి, మైలు రాళ్లను వివరించారు. కళాశాల పూర్వ విద్యార్థి ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ కళాశాల స్వర్ణోత్సవాలలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం కళాశాల వ్యవస్థాపక అధ్యక్షుడు జయభారత్‌రెడ్డిని, బీవీఆర్ మోహన్‌రెడ్డిని, పూర్వ విద్యార్థులు ధర్మాన కృష్ణదాస్, జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు, సినీ నటుడు శుభలేఖ సుధాకర్, కళాశాల మొదటి బ్యాచ్ అధ్యాపకులను, మొదటి మూడు బ్యాచ్‌ల విద్యార్థులను ప్రస్తుత విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కొత్తగా నిర్మించిన గోల్డెన్ జూబ్లీ హాల్‌ను జయభారత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐఏఎస్ అజయ్‌కల్లాం, మొదటి బ్యాచ్ అధ్యాపకులు కె.సత్యనారాయణ, రియాజ్ మహమ్మద్, ఎస్.ఇందిర, పురుషోత్తం, వి.కల్యాణ రామారావు పాల్గొన్నారు.

విశాఖలోనే నా సాహితీ ప్రయాణానికి నాంది

- సినీగేయ రచయిత సుద్దాల అశోక్ తేజ



సినీగీత రచయిత సుద్దాల అశోక్ తేజ, నిర్మల దంపతులను సత్కరిస్తున్న డాక్టర్ కిరణ్ ప్రభు

సీతంపేట: విశాఖతో మంచి అనుబంధం ఉందని, తన సాహితీ ప్రయాణానికి నాంది పలికింది విశాఖలోనే అని ప్రముఖ సినీగేయ రచయిత సుద్దాల అశోక్ తేజ అన్నారు. విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో డాక్టర్ సుద్దాల అశోక్ తేజ మాట, పాట కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తన జీవన ప్రయాణంలోని పలు అంశాలను ప్రేక్షకులతో ఆయన పంచుకున్నారు. తెలంగాణలోని ఒక మారుమూల పల్లెటూరులో జన్మించానని, తన తల్లి,తండ్రి పాటలతో తెలంగాణ రైతాంగ పోరాటంలో ప్రజలను చైతన్యం చేశారని చెప్పారు. వారు ఒక చేత పెన్ను, మరో చేత గన్ను పట్టుకున్న వారియర్స్ కావడం తన అదృష్టమన్నారు. తల్లి, పాట రాస్తూనే జీవితాన్ని ముగించాలని ఉందన్నారు. డాక్టర్ కిరణ్ ప్రభు కౌముది మాట్లాడుతూ విలక్షణ రచయిత సుద్దాల అశోక్ తేజకు జరుగుతున్న సన్మానం తెలుగు పాటకు, ప్రజా గీతానికి జరుగుతున్న సత్కారమన్నారు. అనంతరం సుద్దాల అశోక్‌తేజ, నిర్మల దంపతులను ఘనంగా సత్కరించి జ్ఞాపిక బహూకరించారు.

28న న్యాయవాదుల సంఘం ఎన్నికలు?

విశాఖ లీగల్: విశాఖ న్యాయవాదుల సంఘం వార్షిక ఎన్నికలు ఈనెల 28న నిర్వహించే అవకాశాలు ఉన్నాయని సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ నిబంధన మేరకు వార్షిక సంవత్సరం మార్చి 31తో ముగుస్తుందని, ఈ లోపే ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. న్యాయవాదులందరూ ఈ నెల 6లోపు తమ వార్షిక చందాలు చెల్లించాలని ఆయన కోరారు. గత ఏడాది ఏప్రిల్‌లో తాను అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి పలు సేవా కార్యక్రమాలను నిర్వహించినట్లు వివరించారు. జూనియర్ న్యాయవాదులకు రాష్ట్ర ప్రభుత్వం లా నేస్తం అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. పలు అంశాలను సాధారణ సర్వసభ్య సమావేశంలో చర్చిస్తామన్నారు.

నేడు కృష్ణా కళాశాలలో జాబ్‌మేళా



జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళాశాల విద్యా కమిషనర్ పోలా భాస్కరరావు

మద్దిలపాలెం: డాక్టర్.వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల విద్యా కమిషనర్ డాక్టర్ పోలా భాస్కరరావు తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం 9 గంటల నుంచి మేళా ప్రారంభవుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో బాలికపై లైంగిక దాడి

- యువకుడిపై పోక్సో కేసు నమోదు

కూర్మన్నపాలెం: బాలికను ప్రేమ పేరుతో మోసం చేసి.. లైంగిక దాడి చేసిన యువకుడిపై పోక్సో చట్టం కింద దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేశారు. దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు తెలిపిన వివరాలివీ. అగనంపూడి దిబ్బపాలెం ప్రాంతానికి చెందిన బాలిక అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. సబ్బవరం మండలం గంగవరం గ్రామానికి చెందిన సాయికుమార్ బాలికను ప్రేమిస్తున్నంటూ మాయమాటలు చెప్పి ఫిబ్రవరి 29న తన ఇంటికి తీసుకువెళ్లాడు. స్కూల్‌కి అని చెప్పి వెళ్లిన బాలిక సాయంత్రం అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల గాలించారు. బాలిక గంగవరంలోని యువకుడి ఇంటికి వెళ్లినట్లు తెలుసుకుని అక్కడకు చేరుకున్నారు. ఆ సమయంలో బాలిక సాయికుమార్ ఇంట్లోనే ఉంది. వెంటనే బాలికను అక్కడ నుంచి తీసుకువచ్చి ఏం జరిగిందని ఆరా తీశారు. సాయికుమార్ తనను ప్రేమిస్తున్నానని రోజు స్కూల్ దగ్గర వెంటపడుతున్నాడని, పలుమార్లు లైంగిక దాడి చేశాడని తల్లిదండ్రులకు తెలిపింది. దీంతో బాలిక తల్లిదండ్రులు దువ్వాడ పోలీస్‌స్టేషన్ సాయికుమార్‌పై ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఘనంగా షీ ఫైడ్ అవార్డుల ప్రదానోత్సవం



కిరణ్ బేడీ నుంచి పావనీ తరఫున అవార్డు స్వీకరిస్తున్న రాజన్నాయుడు

బీచ్‌రోడ్డు: దేశ వ్యాప్తంగా ప్రతిభ చూపిన మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని షీ ఫైడ్ అవార్డులను అందజేశారు. ఈ అవార్డుల ప్రదానోత్సవాన్ని నగరంలోని ఒక హోటల్‌లో ఆదివారం నిర్వహించారు. పలు రాష్ట్రాలకు చెందిన కళాకారులు, రచయితలు, డాక్టర్లకు ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఇందులో భాగంగా ఫిక్షన్ పుస్తకాన్ని ఇంగ్లిష్‌లో రచించిన కొరికాన పావని శ్రీని అవార్డుకు ఎంపిక చేశారు. ఆరోగ్య కారణాలతో ఆమె హాజరు కాలేకపోవడంతో ఆమె తాత నల్లాన చిన్న రాజన్నాయుడుకు ఈ అవార్డును పుదుచ్చేరి మాజీ గవర్నర్ కిరణ్ బేడీ అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్‌బేడీ మాట్లాడుతూ పురుషులు, మహిళలు సమానమేనని చెప్పారు. అవార్డులు పొందిన వారిని అభినందించారు.

పీవీ జీవితం ఓ ప్రయోగశాల వంటిది



పీవీ మనువడు ఎన్వీ సుభాష్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఎంపీ జీవీఎల్, బాహ్మణ సంఘాల నాయకులు

మహారాణిపేట: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు బహుముఖ ప్రజ్ఞాశాలని, ఆయన జీవితం గురించి అందరికీ మరింతగా తెలియాలని రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు ఆయన పేరిట స్మారక భవనాలు నిర్మించాలని, ఇందుకు వైజాగ్ బ్రాహ్మిణ్ వెల్ఫేర్ సొసైటీ కృషి చేయాలని జీవీఎల్ కోరారు. పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించిన నేపథ్యంలో ఆదివారం వైజాగ్ బ్రాహ్మిణ్ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ పి.వి.నారాయణ అధ్యక్షతన ఓ హోటల్‌లో నిర్వహించిన నాలుగు మంచి మాటలు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. పి.వి.నరసింహారావు జీవితం ఒక ప్రయోగశాల వంటిదని కేంద్ర ప్రభుత్వంలో ఆయన నిర్వహించినన్ని శాఖలు ఇంకెవరూ చేపట్టలేదన్నారు. ఆయన గురించి భావితరాలకు కూడా సంపూర్ణంగా తెలియజేయవలసిన అవసరం ఉందన్నారు. పీవీ నరసింహారావు ఈ దేశ ప్రధానిగా ఆర్థిక సంస్కరణలు అమలు చేసి దేశాన్ని సమున్నత స్థానంలో నిలిపారని చెప్పారు. సుప్రీంకోర్టు డిజిగ్నేటెడ్ సీనియర్ న్యాయవాది డి.వి.ఎస్.ఎస్ సోమయాజులు మాట్లాడుతూ 1991లో దేశం సంక్షోభంగా ఉన్న సమయంలో ప్రధాని పదవి చేపట్టిన పీవీ నరసింహారావు న్యూక్లియర్, ఆర్థిక శక్తిని దేశానికి అందించారని చెప్పారు. పీవీ మనవడు ఎన్.వి.సుభాష్ మాట్లాడుతూ ఎప్పుడు ఏ పని చేయాలో పీవీకి తెలుసునని, వెనుకబడిన తరగతులను రాజకీయాల్లో ప్రోత్సహించిన పాలనాధ్యక్షుడని తెలిపారు. రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ పీవీ మహోన్నతమైన వ్యక్తిఅని, తన సొంతభూమి 800 ఎకరాలను దళితులకు ధారాదత్తం చేసి, భూ సంస్కరణలు అమలు చేసి చరితార్థుడయ్యారని తెలిపారు. ఏయూ విశ్రాంత రెక్టార్, ప్రొఫెసర్ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ పీవీ నరసింహారావు మితభాషి అని పీవీకి భారతరత్న పురస్కారం ప్రకటించిన ప్రధాని మోదీ ఆంధ్రులకు అభిమానులయ్యారని చెప్పారు. న్యాయవాది కె.వి.రామ్మూర్తి మాట్లాడుతూ సాహితీవేత్తగా,గొప్ప మేధావిగా పీవీ పేరొందారని, ఆయన స్థితప్రజ్ఞుడని, రాజకీయ రుషి అన్నారు. సెంచురియాన్ వర్సిటీ కులపతి ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్. రాజు మాట్లాడుతూ దేశంలో సంస్కరణలు అమలు చేసి, మూడు ట్రిలియన్ డాలర్లను పోగేసిన ఆర్థిక శాస్త్రవేత్త పీవీ అని తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్, యువనేత ద్రోణంరాజు శ్రీవాత్సవ, కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి ప్రసంగించారు. ఈ సందర్భంగా వైజాగ్ బ్రాహ్మిణ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కావూరి చరణ్ కుమార్, కన్వీనర్ పి.వి.నారాయణలు పీవీ నరసింహారావు మనవడు ఎన్వీ సుభాష్‌కు జ్ఞాపిక అందజేశారు. వైజాగ్ బ్రాహ్మిణ్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు న్యాయవాది నరసింహమూర్తి, హనుమంతరావు,నండూరి సుబ్రహ్మణ్యం, అరుణ్ కుమార్, నాగభూషణం, రామభద్రుడు, శర్మ, రామకృష్ణ పాల్గొన్నారు.ముందుగా పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శాకంబరిగా దుర్గాలమ్మ

9న అమ్మవారి వార్షిక జాతర మహోత్సవం



శాకంబరీగా దర్శనమిచ్చిన అమ్మవారు

డాబాగార్డెన్స్: పూర్ణామార్కెట్‌లోని వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 1న చాటింపు, రాటమహోత్సవంతో ప్రారంభమైన ఉత్సవాలు ఈ నెల 9వ తేదీ వరకు కొనసాగనున్నాయి. 9న అమ్మవారి జాతర మహోత్సవం పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. 16న మారువారం , 17న 5వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఉత్సవాల్లో భాగంగా దుర్గాలమ్మ ఆదివారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. 4న పుష్పాలంకరణ, 5న సౌభాగ్యలక్ష్మిగా గాజుల అలంకరణలో దర్శనమివ్వనున్నారు. 6న సాయంత్రం 4.30 గంటలకు దీపాలంకరణ, 7న తొలేళ్ల ఉత్సవం, 8న మహాశివరాత్రి పురస్కరించుకుని ఉదయం 5 గంటల నుంచి కుంకుమార్చనలు, దర్శనాలు, ఘాలాల పండగ, భక్తులు అగ్నిగుండం తొక్కే కార్యక్రమం ఉంటుంది. ఆ రోజు అర్ధరాత్రి 12 గంటలకు అమ్మవారి నేత్రోత్సవం, తొలిపూజ అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. 9న అమ్మవారి జాతర మహోత్సవం పురస్కరించుకుని ఉదయం 3 గంటల నుంచి దర్శనాలు, ఘటాలతో భక్తులు వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకోనున్నారు. 16న మారువారం పండగ సందర్భంగా అష్టోత్తర శత పదార్థ నివేదన(108 రకాల వంటకాలు) చేయనున్నారు. మరుసటి రోజు(17)న మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయ ప్రాంగణం వద్ద 5 వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నారు. దుర్గాలమ్మ వార్షిక జాతర సందర్భంగా పరిసర ప్రాంతాల్లో సందడి నెలకొంది. పలు వీధుల్లో దుర్గమ్మ విగ్రహాలు నెలకొల్పి.. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

టీడీపీ-జనసేన తొలి జాబితాలో బీసీలకు అన్యాయం

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్



మాట్లాడుతున్న కేశన శంకరరావు

డాబాగార్డెన్స్: బీసీలకు టికెట్లు కేటాయించని పార్టీలకు ఓట్లతో బుద్ధి చెబుతామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్, ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు హెచ్చరించారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 50 శాతం పైగా ఉన్న బీసీలకు అన్ని పార్టీలు అధిక సంఖ్యలో అసెంబ్లీ, పార్లమెంట్ టికెట్లు కేటాయించాలన్నారు. ఇటీవల టీడీపీ–జనసేన ప్రకటించిన మొదటి జాబితాలో బీసీలకు కేవలం 21 సీట్లు మాత్రమే కేటాయించి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. మలివిడత జాబితాలోనైనా బీసీలకు 50 శాతం సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్టీ ఫిరాయింపుదారులు, డబ్బున్న వారికి టికెట్లు ఇవ్వడానికి పోటీ పడతున్నారని, జెండా మోసే బీసీలకు మాత్రం టికెట్లు ఇవ్వకుండా రాజకీయంగా అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. కేవలం 2 నుంచి 3 శాతం ఉన్న వారి ఓట్లు కావాలో.. 50 శాతం ఉన్న వారి ఓట్లు కావాలో ప్రధాన పార్టీలు తేల్చుకోవాలని సూచించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ని శ్రీనివాసరావు, విశాఖ అధ్యక్షుడు పల్లా రమణయాదవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మరి క్రాంతికుమార్, గొర్లె శ్రీనివాసనాయుడు, కామన వెంకటసుబ్బారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.